దయచూపండయ్యా..!

- కాళ్లరిగేలా తిరుగుతున్నాం.. • సమస్యలు పరిష్కరించాలని అర్జీదారుల వినతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కు జిల్లా పరిధి లోని వివిధ మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన ప్రజలు తాము కాళ్లరిగేలా తిరుగుతున్నామని తమపై దయచూపి సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ అధికారులకు అర్జీలు సమర్పించారు. కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి, డి ఆర్ ఓ కె మోహన్ కుమార్, ఆర్డీఓ శ్రీనివాసులు తో కలసి అర్జీదారుల నుండి సమస్యల అర్జీలను స్వీకరించారు.

రోడ్డు సౌకర్యం కల్పించండి

ఎస్ఆర్ పురం మండపం, ఏయం పురం పంచాయతీ, అర్ ఆర్ పురం, ఎస్టీ కాలానికి చెందిన సుమారు 15 కుటుంబాలు కొక్కి రాళ్ల కొండ కింద జీవిస్తున్నాయి. మేము రోడ్డు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాము.. మాపై కనికరించి రోడ్డు సౌకర్యం కల్పించండి..

-పద్మనాభం. సురేష్,శాంతి, కన్నమ్మ, నందిని,భారతి కోరారు.

మా ఊరి పాఠశాల మార్చొద్దు

పుంగనూరు మండలం ఈడిగపల్లి పంచాయతీ, మరసనపల్లె గ్రామానికి చెందిన గ్రామస్తులు తమ గ్రామంలో ఉన్న పాఠశాలలో 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు 22 మంది విద్యార్థులు చదువుతున్నారని, ప్రస్తుతం 3వ తరగతి నుండి 5వ తరగతి వరకు గల విద్యార్థులను మరసనపల్లె గ్రామం నుండి ఈడిగపల్లెకు మార్చారన్నారు. విద్యార్థులు సుమారు 1 కిలోమీటరు కాలినడకన వెళ్లి రావలసి ఉందని, 3వ తరగతి నుండి 5 వ తరగతులను నిర్వహించాలని కలెక్టర్‌ను కోరారు. యథావిధిగా తమ గ్రామంలో పాఠశాలలు కొనసాగించాలని కలెక్టర్‌ను కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని డిఈఓ ను కలెక్టర్ ఆదేశించారు.

పశువుల భూమిని కాపాడండి

ఎస్ఆర్ పురం మండలం ఏఎం పురం పంచాయతీ, ఆర్ ఆర్ పురం ఎస్‌టీ కాలనీ కి చెందిన గ్రామస్తులు కూలి పని తమ జీవనాధారమని, ఆర్ఆర్‌పురం లెక్క దాఖలాలలో వున్న సర్వే నెం: 170లో 18/02లో ఎకరాల భూమిని పశువులు, మేకలు, గొర్రెలు మేపుకోవడానికి

రోడ్డు సౌకర్యం కల్పించండి కోరుతున్న ఎస్ఆర్‌పురం మండల ప్రజలు

వినియోగించుకుంటున్నామని, తమ గ్రామంలోని మోతుబరీ రైతు కుటుంబం వాళ్ళ ఈ భూమి పై అధికారం చెలాయిస్తూ బెదిరిస్తున్నాడని, తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఎస్ ఆర్ పురం మండల తహశీల్దారును కలెక్టర్ ఆదేశించారు.

మద్యం షాపు తొలగించండి..

వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం గ్రామస్తులు తమ గ్రామ సచివాలయం సమీపంలో మద్యం షాపు వుందని, మద్యం షాపుకు సమీపంలో చర్చి, మాతమ్మ గుడి ఉందని, దారిలో వెళ్లడానికి రావడానికి ఆడవారు, స్త్రీలు ఇబ్బంది పడుతున్నారని, ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని వీలైనంత త్వరగా మద్యం షాపును తొలగించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇంటి పట్టాలు మంజూరు చేయండి

యాదమరి మండలం, దాసరపల్లి గ్రామ పంచాయతీ ఆది ఆంధ్ర వాడ ప్రజలు తమ గ్రామ రెవెన్యూ లెక్క దాఖల సర్వే నెంబర్ 343/2డి లోని ఒక ఎకరా ప్రభుత్వ భూమిలో సుమారు 30 ఏళ్లుగా కొన్ని కుటుంబాలు ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నామని, సదరు భూమిలోని ఇళ్లను, షెడ్లను కూల్చివేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని, తమను కాపాడాలని, తమ ఇళ్ల పట్టాలను మంజూరు చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

ఇంటి స్థలాన్ని లాక్కుంటున్నారు రక్షణ కల్పించండి

ఐరాల మండలం 35 ఎర్రంపల్లి గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ తాము ఎస్టీ కాలనీలో నివాసముంటున్నామని, తమ మామకు చెందిన ఇంటి స్థలం ను గ్రామస్తులు దౌర్జన్యంగా ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, తమకు న్యాయం చేయాలని కలెక్టర్ ను కోరారు. పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఐరాల మండల తహశీల్దారును కలెక్టర్ ఆదేశించారు.

ప్రజల అర్జీలకు పరిష్కారం చూపాలి : కలెక్టర్

చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే ప్రతి అర్జీదారుడిని సంతృప్తి స్థాయిలో పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం జిల్లా సచివాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ మూడు నెలల పాటు పలమనేరు డివిజన్‌లో పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. చిత్తూరులో నిర్వహించిన పి జి ఆర్ ఎస్ లో దాదాపు 250 అర్జీలు వచ్చాయని, ఇందులో రెవెన్యూ సమస్యలు అధికంగా గుర్తించామన్నారు. పలమనేరు డివిజన్‌లో వరుసగా పి జి ఆర్ ఎస్ నిర్వహించడం వల్ల పలమనేరు డివిజన్ నుండి అందే అర్జీల సంఖ్య తగ్గాయని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు పాల్గొనేలా శాఖాధిపతులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల అర్జీలకు సంబంధించి ఎన్‌డార్సుమెంట్లు స్పష్టంగా ఇవ్వాలన్నారు. పరిష్కరించిన అర్జీలకు ఆడిట్ నిర్వహిస్తామని నాణ్యమైన పరిష్కారం చూపాలని ఆదేశించారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

డీఈఓ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయుల ధర్నా

పజాశక్తి -చిత్తూరు అర్బన్ : పాఠశాలల పున: వ్యవస్థీకరణ, బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని, పాఠశాల విద్యాశాఖ అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా డీఈవో కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి జివి రమణ, చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎన్ మణిగండన్ లు మట్లాడుతూ రికగ్నైజుడు ఉపాధ్యాయ సంఘాలతో ప్రతీవారం విద్యాశాఖ అధికారులు సమావేశమై చర్చిస్తున్నప్పటికీ ఉపాధ్యాయుల్లో ఆందోళన కలిగిస్తున్న ప్రధాన సమస్యలపై విద్యాశాఖాధికారులు స్పందించకుండా ఏకపక్షంగా చేపడుతున్న చర్యల వల్ల విద్యారంగం నష్టపోతుందని వారు పేర్కొన్నారు. గత ప్రభుత్వం 3,4,5 తరగతుల విలీనం, జిఓ 117 పేరుతో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలు చేపట్టిందని, ఉపాధ్యాయుల సంఖ్య తగ్గించి పనిభారం పెంచిందని, ఫలితంగా 10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుండి తరలిపోయారన్నారు. జిఓ 117ను రద్దు చేస్తామని, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని చెప్పిన ప్రభుత్వం, అందుకు విరుద్ధంగా గత ప్రభుత్వ బాటలోనే పయనించడం విచారకరమన్నారు. కొత్తగా 779 హైస్కూళ్లు అప్‌గ్రేడ్ చేయడం, 9,652 మోడల్ ప్రైమరీ స్కూల్సు ఏర్పాటు చేయడం హర్షణీయమని, అయినా హైస్కూళ్లలో 54 మంది విద్యార్థులు ఉంటేనే 2వ పోస్టు కేటాయిస్తామనే వైఖరి తీసుకురావడం వల్ల ఉన్నత పాఠశాలల్లో వేలాది పోస్టులు ముఖ్యంగా గణితం, ఇంగ్లీషు స్కూలు అసిస్టెంట్ పోస్టులు మిగిలిపోతున్నాయన్నారు. మోడల్ ప్రైమరీ స్కూల్సుకు ప్రాధాన్యమిస్తూ ఫౌండేషన్ స్కూళ్లు, బేసిక్ ప్రైమరీ స్కూళ్లను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఈ వైఖరి విద్యారంగానికి తీవ్ర నష్టం తీసుకొస్తుందని ఉన్నత పాఠశాలల్లో 46 మంది విద్యార్థులు ఉంటే 2వ సెక్షన్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఫౌండేషన్, బేసిక్ ప్రైమరీ స్కూళ్లలో 1:20 ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలని, ఏప్రిల్ నాటి రోల్ ఆధారంగా పోస్టుల కేటాయింపు చేయాలన్నారు. స్కూలు అసిస్టెంట్లను యుపి, హైస్కూళ్లలోనే వినియోగించాలని, అట్లే బదిలీలు, ఉద్యోగోన్నతులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా 2021 తర్వాత రెండుసార్లు రేషనలైజేషన్‌కు గురైన టీచర్లకు అదనపు పాయింట్లు కేటాయించి న్యాయం చేయాలని సూచించారు. ఈ సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 15వ తేదీ వేలాది మంది ఉపాధ్యాయులతో విద్యాభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ పరిస్థితి రాకుండా విద్యాశాఖ మంత్రి, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు పి సుధాకర్ రెడ్డి, సహాధ్యక్షులు ఎస్ రెహనాబేగం ,కె రెడ్డప్ప నాయుడు కోశాధికారి కె ప్రసన్నకుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె దీనావతి, రాష్ట్ర కౌన్సిలర్లు ఎస్‌పి బాషా , పిఆర్ మునిరత్నం, రఘుపతి రెడ్డి, జిల్లా కార్యదర్శులు కే సరిత, డి ఏకాంబరం, సురేష్, ఎం పార్ధసారథి, కే గణేష్ కుమార్, ఎంవి రమణ, పీసీ బాబు, ఆడిట్ సభ్యులు వంశీ కృష్ణ, సాధన కుమార్, వెంకటేశులు రవీంద్రబాబు, మోహన్ రెడ్డి అన్ని మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులతో పాటు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు 234 అర్జీలు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా సచివాలయంలోని గ్రీవెన్స్ హాలులో కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ జి విద్యాదరి, డిఆర్‌ఓ కె మోహన్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనుపమ, చిత్తూరు ఆర్డిఓ శ్రీనివాసులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. మొత్తం: 234 అర్జీలు వచ్చాయని తెలిపారు. ఇందులో రెవెన్యూ శాఖ కు 189, పోలీస్ 7, ఆర్ అండ్ బి 1, డి ఆర్ డి ఏ 21, మున్సిపల్ కమిషనర్, చిత్తూరు 1, డీఎస్‌ఓ 5, అనిమల్ హస్బండ్రీ 2, ఏ పి ఎస్ పి డి సి ఎల్ 5, గనుల శాఖ 1, రెజిస్ట్రేషన్ శాఖకు 2, వివిధ ప్రాంతాల నుండి అర్జీలు వచ్చాయని కలెక్టర్, జెసి లకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిద శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడి

పలువురికి గాయాలు

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని తేనె తుట్టెపై ఆకతాయిలు రాయి విసరడంతో తేనెటీగలు చెల్లాచెదురై సమీప ప్రాంతాల్లోని జనాలపై దాడి చేసి గాయపరిచాయి. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఆకతాయిలు తేనె తుట్టే పై రాయి విసిరారని తేనెటీగలు వారిపై దాడి చేసి అనంతరం సోమల -పుంగనూరు మార్గంలోని ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని, పాదచారులపై దాడి చేశాయి. ఎంపీడీవో, తహశీల్దారు, వెలుగు, ఇతర కార్యాలయాల్లోకి తేనెటీగలు రావడంతో సిబ్బంది అప్రమత్తమై తలుపులు వేసుకొని విధులు నిర్వహించారు. రోడ్డుపై వెళుతున్న పాదచారులు తేనెటీగల దాడి నుండి తప్పించుకునేందుకు కార్యాలయాల్లోకి పరుగులుతీసి తలదాచుకున్నారు. తేనెటీగల దాడిలో ఒకరిద్దరు వీఆర్‌వోలు, పాదచారులు గాయపడ్డారు.

ఆస్పత్రిలో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా అదనపు వైద్యాధికారి వెంకటప్రసాద్

వైద్యులకు సేవా దృక్పథం అవసరం

జిల్లా అదనపు వైద్య అధికారి వెంకటప్రసాద్

ప్రజాశక్తి -బంగారుపాలెం : వైద్యులకు సేవా దృక్పథం అవసరం అని జిల్లా అదనపు వైద్యాధికారి వెంకట ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని సామాజిక వైద్య కేంద్రాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి చికిత్సకు వచ్చేవారికి సేవా దృక్పథంతో సేవ చేయాలని వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకుని తగిన మందులు అందించి వారికి వ్యాధి నయమయ్యే విధంగా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి వైద్య సిబ్బంది దీన్ని పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శిరీష, ఐసిటి ఎస్ కౌన్సిలర్ బాబు , సిబ్బంది శంకర్, శివకుమార్, ప్రకాష్, భవాని, ద్రాక్షాయిని పాల్గొన్నారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు ఎంపీడీవో ఎస్ సతీష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నగిరి ఎంపీడీవోగా పనిచేస్తూ బదిలీపై గంగాధర నెల్లూరుకు వచ్చారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, మండల సచివాలయ సిబ్బంది ఎంపీడీఓను మర్యాద పూర్వకం గా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సతీష్ మాట్లాడుతూ ప్రజా ప్రతి నిధులు, అధికారులు, సిబ్బంది సహకారంతో మండలాన్ని అభివృద్ధిలోకి తీసుకెళ్లి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, విజయవంతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపిడివో సతీష్

తల్లిబిడ్డల సంరక్షణ పథకానికి రక్షణ ఏదీ?

- ఏజెన్సీ రద్దుచేసి ప్రభుత్వమే నిర్వహించాలి
- సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన
- 102 వాహన డ్రైవర్ల హెచ్చరిక

పజాశక్తి - చిత్తూరు అర్బన్: గత రాష్ట్ర ప్రభుత్వం 2016లో గ్రామీణ ప్రాంతంలో ఉన్న గర్భిణి మహిళలు సురక్షితంగా ప్రసవం కలగాలనే లక్ష్యంతో తల్లి బిడ్డల ఎక్స్‌ప్రెస్ వాహనాలను ఏర్పాటు చేసింది. జిల్లాలో 16 వాహనాలు ఉన్నాయి. గ్రామీణ ప్రజలు ఎవరు ఫోన్ చేసినా అక్కడికి వెళ్లి వారిని తీసుకొచ్చి ఆసుపత్రులకు చేర్చేవి. అదేవిధంగా ఆస్పత్రిలోంచి తిరిగి వారి ని గమ్యస్థానానికి చేరవేస్తుంటారు. వాటి నిర్వహణను అరబిందో ఏజెన్సీకి అప్పగించి వాహనాలకు డ్రైవర్లు ఏర్పాటు చేసింది. తల్లి బిడ్డల సంరక్షణ పేరుకు మాత్రమే గానీ అందులో ఆ వాహనాలలో ప్రయాణించే వారికి మాత్రం సంరక్షణ కరువైందన్నారు. వాహనాలు కండిషన్ బాగాలేక ఎప్పుడు ఏమి జరుగుతుందో అని భయంతో డ్రైవర్ల జాగ్రత్తగా తల్లి బిడ్డలను సురక్షితంగా వారిద్దరిని వారి గమ్యస్థానాలకు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని భయంతో చేరుస్తున్నారు. 2016 నుండి ఏజెన్సీ వారు డ్రైవర్లు దగ్గర నుండి వెట్టిచాకిరీచేయించుకుంటూ అతి తక్కువ వేతనాలు 7,800 రూపాయలు మాత్రమే ఇస్తూ అవి కూడా నెల నెల ఇవ్వకుండా సంవత్సరానికి ఆరు నెలలకు జీతాలు ఇస్తుంటే వారి కుటుంబాలు ఎలా గడవాలని ప్రశ్నించారు. ఇందులో పనిచేస్తున్న డ్రైవర్ల అందరూ పేదవారు.. వేతనాల మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం ఐదు నెలల వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులు పడుతుంటే తీయ మేము బిచ్చం చేసి బతకాల్సిందేనని అంటున్నారు. సేవ చేస్తున్న డ్రైవర్లను బిచ్చగాలుగా మార్చడమేనా? అని ఆ వాహన ఉద్యోగులు రాష్ట్ర ప్రభుతాన్ని

ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అధికారులు వెంటనే స్పందించి తల్లి బిడ్డలకు సేవలు అందిస్తున్న తల్లి బిడ్డల ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు

వేతనాలు అందించి, కొత్త వాహనాలు ఇవ్వాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, వారికి భద్రత కల్పించాలని ఇన్సూరెన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

ఐదు నెలలుగా వేతనాలు బకాయి ఉండడంతో 102 డ్రైవర్లు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఇక వారికి భిక్షాటన చేయడమే మార్గం తప్ప మరో దారి కన్పించడంలేదు. పభుత్వం డ్రైవర్ల దగ్గర వెట్టి చాకిరీ చేయించుకుంటూ ఇబ్బంది పెడుతున్నారు. హెవీ లైసెన్స్ ఉండి వాహనాలను డ్రైవింగ్ చేస్తున్నామని ఇదే పని బయట చేస్తే 20వేలు పైన వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు . ప్రభుత్వ సంస్థ అని భవిష్యత్తులో ఏమైనా పర్మినెంట్ చేస్తారేమోనని ఆశతో ఇన్ని ఇబ్బందులు పడుతూ పని చేస్తున్నాం..

- యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు

కనీస వేతనాలు అమలు చేయాలి

దేశంలోని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇచ్చి కనీస వేతనాలు అమలు చేయాలని స్పష్టంగా తీర్పించిన ప్రభుత్వాలు పట్టించుకోక పోవడం దుర్మార్గం.. ప్రభుత్వ లక్ష్యం కోసం రకరకాల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పథకాల్లో కూడా పనిచేస్తున్న సిబ్బందికి ఎలాంటి సౌకర్యాలు కల్పించుకుంటా వెట్టి చాకిరీ చేయించడం ఏమిటీ? తల్లి బిడ్డల ఎక్స్‌ప్రెస్ వాహనాల డ్రైవర్లకు వెంటనే ఒకే వేతనాలు చెల్లించి కనీస వేతనం అమలు చేయకపోతే భవిష్యత్తులో నిరవధిక సమ్మెకు దిగుతారు...

- వాడ గంగరాజు, యూనియన్ గౌరవాధ్యక్షులు.

నేడు, రేపు గంగ జాతర

- 500 మంది పోలీసులతో బందోబస్తు
- సీసీ కెమెరాల నిఘా

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: మంగళ, బుధవారాల్లో నిర్వహించనున్న చిత్తూరు నడి వీధి గంగమ్మ జాతర ప్రాంతాలను ఎస్‌పి మణికంఠ చందోలు సోమవారం పరిశీలించారు. 500 మందితో సిబ్బందితో పటిష్ట బందోబస్తు, 24/7 జాతర ప్రాంతాలను సిసి కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ కోసం ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీ ఎక్కువ ఉంటుందని దీన్ని దృష్టిలో వుంచుకుని దొంగతనాలు జరగకుండా ప్రతి ఒక్కరిపై నిఘా ఉంచాలని ఆదేశించారు. ప్రతి సంవత్సరం చిత్తూరు పట్టణంలోని బజార్ వీధిలో నడివీధి గంగమ్మ జాతరకు సంబంధించిన ప్రాంతాలను ఎస్‌పి ఆలయ ధర్మకర్త సతీమణి సికె లావణ్యతో, అడిషనల్ ఎస్‌పి ఆపరేషన్స్ , ఇన్‌ఛార్జి అడ్మిన్ ఎస్ఆర్ రాజశేఖర రాజుతో కలిసి చర్చి వీధి, బజార్ వీధి, శివాలయం వీధి, డీజే నిర్వహిస్తున్న మ్యాక్స్ షోరూం, అమ్మవారిని నిమజ్జనం చేస్తున్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రతి ఏటా చిత్తూరు పట్టణంలో గంగమ్మ జాతర ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారని ఈ సంవత్సరం కూడా జాతరకు తగిన పోలీస్ సిబ్బందితో పాటు, అదనపు బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని, ప్రజలకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా జాతర నిర్వహించే ప్రదేశాలలో ట్రాఫిక్ మళ్లింపు చేశామని తెలిపారు. దొంగతనాలు, ఆకతాయిల వెకిలి చేష్టల నివారణకు నిష్ణాతులైన క్రైమ్ సిబ్బందితో ప్రత్యేక క్రైమ్ బృందాలు ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచనున్నట్లు తెలిపారు. జాతర సమయంలో ఎటువంటి చట్ట వ్యతిరేఖ కార్యకలాపాలకు పాల్పడ కుండా శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా జాతర సజావుగా సాగేలా సహకరించాలని పట్టణ ప్రజలను కోరారు.

జాతర బందోబస్తుపై పోలీసులకు సలహాలు, సూచనలు ఇస్తున్న ఎస్‌పి

ఉర్దూ డిఐ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి

ప్రజాశక్తి- చిత్తూరు: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉర్దూ టీచర్ పోస్టులు భర్తీ చేయాలని ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. రాష్ట్రం లోని చిత్తూరు, కర్నూలు, అనంతపురం, కడప, కృష్ణ, ,గుంటూరు, బాపట్ల, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి, నెల్లూరు, ప్రకాశం జిల్లాల ఉర్దూ డీఐ (డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్, ఉర్దూ రేంజ్) పోస్టులు అర్హులైన వారితో భర్తీ చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్ , సయ్యద్ ముష్తాఖ్ సంయుక్త ప్రకటనలో కోరారు. ఉర్దూ పాఠశాలల పర్యవేక్షణకు, విద్యార్థుల విద్యాభివృద్ధికి, ఉర్దూ ఉపాధ్యాయులకు మార్గదర్శకులుగా ఉర్దూ డిఐలు ఎంతో దోహదపడతారని, ఉర్దూ డిఐలు లేని కారణంగా గత దశాబ్ద కాలంగా ఉర్దూ పాఠశాలలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎంతో నష్ట పోయాయారని ఉర్దూ డిఐ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

యుజి, పిజి సెమిస్టర్ ఫలితాలు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తున్న దృశ్యం

యుజి, పిజి సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి -గుడు పల్లి : ద్రావిడ విశ్వవిద్యాలయంలో యుజి 6 సెమిస్టర్, పిజి 4 సెమిస్టర్ పరీక్షా ఫలితాలను మొట్టమొదట ఆన్ లైన్‌లో సోమవారం విడుదల చేశారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎం దొరస్వామి పరీక్ష ఫలితాలను విద్యార్థులకు సులభతరం చేసేందుకు ఆన్ లైన్ వ్యవస్థను ప్రారంభించారు. ఈ పరీక్షా ఫలితాలను యూనివర్సిటీ వెబ్ సైట్‌లో పొందుపరిచామని విద్యార్థినివిద్యార్థులు వారి పరీక్ష ఫలితాలను వెబ్ సైట్ హెచ్‌టిటిపిఎస్:// డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. ద్రావిడ యూనివర్సిటీ.ఎసి.ఇన్ ద్వారా తెలుసుకోవచ్చని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి.కిరణ్ కుమార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య పి నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరికృష్ణ, డీన్ శ్రీనివాస్ కుమార్, కేశవమూర్తి డిప్యూటీ రిజిస్ట్రార్ ఎన్ మాధవ నాయుడు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సమ్మె నోటీసు అందిస్తున్న పారిశుధ్య కార్మికులు

ఎంపీడీవోకు సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి -బంగారుపాలెం:

ఎంపీడీవో శ్రీధర్‌కు పారిశుధ్య కార్మికుల జిల్లా అధ్యక్షులు మధు, మండల అధ్యక్షులు కన్నయ్య ఆధ్వర్యంలో సమ్మె నోటీసు సోమవారం అందించా రు. ఈ సందర్భంగా జిల్లా పారిశుధ్య కార్మికుల సంఘం అధ్యక్షులు మధు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా నాలుగు లేబర్ కోడ్‌లు అమలు చేయాలని చూస్తోందని కార్మిక చట్టానికి వ్యతిరేకంగా లేబర్ కోడ్‌లు ఉన్నాయని వీటి వల్ల కార్మికులు నష్టపోతారని వెంటనే రద్దుచేసి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. లేదంటే దేశవ్యాప్తంగా ఈ నెల 20వ తేదీ సమ్మె బాట చేపడుతున్నామని ఇందుకు కార్మికులందరూ సహకరించి సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో పారిశుధ్య కార్మికులు పోన్ మనీ, బాలాజీ, సుబ్రహ్మణ్యం, ప్రసాద్, రవి, కృష్ణమూర్తి, మొగిలి అమ్మ, చిట్టెమ్మ, లక్ష్మమ్మ పలువురు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

రైతుల పేర్లు పరిశీలించుకోవాలి: ఎంఏవో

ప్రజాశక్తి -శాంతిపురం: అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి రైతుల వివరాలు రైతు సేవా కేంద్రాలలో ఉన్నాయని, మండల రైతులు వారివారి పేర్లు పరిశీలిం చుకోవాలని మండల వ్యవసా య అధికారి జి అప్పోజి సోమవారం పేర్కొన్నారు. మండలం లోని రైతులు తమ పేర్లు ఉన్న వారు రైతు సేవా కేంద్రాల సిబ్బంది ద్వారా అప్రూవల్ చేయించుకుని లబ్ధి పొందాలని రైతులకు సూచించారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది రైతుల వివరాలను నోటీసు బోర్డులో తెలపాలని, అర్హులైన రైతుల వివరాలను అప్రూవల్ చేయాలని ఆర్ఎస్‌కె సిబ్బందికి సూచించారు. ఈ అన్నదాత సుఖీభవ పథకానికి అనర్హులుగా భూమి లేని రైతులు, రాజ్యాంగబద్ధమైన స్థాయిలో ఉన్నా, గవర్నమెంట్ ఉద్యోగంలో ఉన్నా, టాక్స్ చెల్లిస్తున్నా, రిటైర్డ్ పెన్షన్ పొందుతున్నా రైతులను మాత్రమే అనర్హులుగా గుర్తించి తిరస్కరించాలని రైతు సేవా కేంద్రాలకు సూచించారు. మండలంలో 18,050 మంది రైతులను అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులుగా గుర్తించామన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బాబునాయుడు

మహిళల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యం

ప్రజాశక్తి- గుడుపల్లి: మహిళల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని టిడిపి మండల అధ్యక్షు డు బాబు నాయుడు పేర్కొన్నా రు. గుడుపల్లె మండలంలో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ 148 మంది మహిళలు ఉచిత కుట్టు మిషన్ శిక్షణకు దరఖాస్తు చేసుకున్నారని వారందరికి నేటి నుండి 90 రోజులు పాటు రెండు బ్యాచ్‌లుగా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణలో 75 శాతం హాజరు పూర్తి చేసుకున్న దరఖాస్తుదారులకు శిక్షణ, కుట్టు మిషన్‌లు ఉచితంగా అందిస్తారన్నారు. మొదటి బ్యాచ్ ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 వంట వరకు, రెండవ బ్యాచ్ మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో , డిప్యూటీ ఎంపీడీవో, ఏపీఎం, మహిళా దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

కోనేరు మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న ఎంపిపి

కోనేరుకు మరమ్మతులు: ఎంపీపీ

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ఉంటే కోనేరుకు ఉపాధి హామీ పనుల ద్వారా మరమ్మతులు చేపడు తున్నట్టు ఎంపీపీ అమరావతి పేర్కొన్నారు. మండలంలోని తుంబకుప్పం గ్రామంలో ఉంటే కోనేరుకు సోమవారం మరమ్మతులు ఏపీవో భవిత ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అమరావతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఉపాధి హామీ పనుల ద్వారా కూలీలకు పని కల్పించే కార్యక్రమం చేపడుతున్నామని ఈ పనులు వల్ల గ్రామీణ ప్రాంత ప్రజలు వలసలు వెళ్లకుండా గ్రామంలోనే పనులు చేసుకుని ఆర్థికంగా నిధులు సమకూర్చుకోవచ్చని అన్నారు. అనంతరం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లీలావతమ్మ, మాజీ సర్పంచ్ అన్నామల్‌రెడ్డి, గ్రామస్తులు రమేష్ పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవానికి తిలకిస్తున్న భక్తులు

కనువిందు చేసిన శ్రీవారి కల్యాణం

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల సమీపం లోని పరుష వెంకటేశ్వర స్వామి వారి వైశాఖ పౌర్ణిమ (మొలకల పౌర్ణమి) ఉత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో వైభవంగా నిర్వహించిన భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం భక్తులకు కనువిందు చేసింది. ఉదయం వెంకటేశ్వర స్వామి పాదాల గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వేదికపై ఏర్పాటు చేసి వేదమంత్రాల నడుమ స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. సోమల తదితర ప్రాంతాల నుండి ప్రజలు హాజరై ఈ కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం మధ్యాహ్నం ఒంటిగంట నుండి సాయంత్రం ఏడు గంటల వరకు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి హనుమంతరావు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల వివరాలను ఈహెచ్‌ఆర్ లో నమోదు చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి హను మంత రావు సూచిం చారు. సోమవారం ఆయన గంగాధర నెల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇక్కడకు వచ్చే రోగులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అదనపు చికిత్స అవసరమైతే వెంటనే చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేయాలని తెలిపారు. 70 సంవత్సరాలు పూర్తయిన వారికి జన ఆరోగ్య యోజన కోసం ఈ కేవైసీ చేయించి నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ శ్రీనివాసులు, ఫార్మసిస్ట్ నాగలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ షాన్ వాజ్ పాల్గొన్నారు.

పంచాయతీలకు త్రైమాసిక నిధులు విడుదల

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా పరిధిలోని 33 మండలాల పరిధిలో ఉన్న 774 గ్రామపంచాయతీలకు 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి త్రైమాసిక నిధులు రూ.1,46,10,233/- రూపాయలను ప్రభుత్వం నుండి నేరుగా ఆయా గ్రామ పంచాయతీల సాధారణ నిధుల ఖాతాకు జమ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి సుశీల దేవి ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో తలసరి ఆదాయం(2024-25కి సంబంధించి) రూ.14,51,567/- , వృత్తి పన్ను(2024-25కి సంబంధించి) రూ.35, 02, 383/-, సర్పంచుల గౌరవ వేతనం(2025-26కి ఆర్థిక సంవత్సరానికి సంబంధించి)ఎన్నికలు జరిగినవి (745) రూ. 96,56,283/- కలిపి జమ చేయబడ్డాయి.

శ్రీవారి సేవలో మంత్రులు

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల శ్రీవారిని ఏపీ వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయం బయట కొల్లురవీంద్ర మాట్లాడు తూ చంద్రబాబుకు స్వామి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించానన్నారు.

అమర జవాన్‌కు న్యాయవాదుల నివాళి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : దేశభద్రత కోసం వీరోచితంగా పోరాడి ప్రాణాలు వదిలిన, జవాన్ మురళి నాయక్ మృతికి పుత్తూరు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజేష్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దేశ రక్షణ వైపు అడుగులు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జ్ జానకి, అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ రమ్య సాయి, న్యాయవాదులు దినకర్, జానకిరామ్, మహిళ నాయకులు నదియా, శేషాచలం, పురుషోత్తం, సంజీవి, రామచంద్ర రెడ్డి, నాధముని పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు విచారించి పరిష్కరించాలి: కమిషనర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'ను నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో భాగంగా కమిషనర్ పి నరసింహ ప్రసాద్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీక రిం చారు. ప్రజలు అందించిన వినతులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి.. సమస్యలను పరిష్కరించాడానికి చర్యలు తీసుకున్నారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందే వినతులను సంబంధి త అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలని, సంబంధిత నివేదికలను సకాలంలో సమర్పించాలని ఆదేశించారు. సోమవారం నాటి కార్యక్రమంలో ఇంజనీ రింగ్‌కు 3, రెవెన్యూకు 2 టౌన్ ప్లానింగ్‌కు1 చొప్పున మొత్తం ఆరు వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టరు లోకేష్, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఏసీపీ నాగేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న సర్పంచ్ ప్రవీణ్

ఉచిత మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి -తవణంపల్లి:

మండలంలోని అరగొండ మేజర్ గ్రామ పంచాయతీ పరిధి లోని సంత గేటు వద్ద ఏ గొల్లపల్లి సర్పంచ్ ప్రవీణ్ సోమవారం మజ్జిగ ఉచితంగా సరఫరా చేశారు. ఈ సంద ర్భం గా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల నుంచి సంతకు అనేకమంది ప్రజలు వస్తుంటారని, ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు ఇబ్బంది పడకుండా వుండేం దుకు సంతకు వచ్చే వారికి ఉచితంగా మంచినీళ్లు, మజ్జిగ అందించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు గాలి దిలీప్, వేణు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగిని టిడిపిలో చేరిక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ :

రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగిని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ సమక్షంలో సోమవారం టిడిపిలో చేరారు. చిత్తూరు రాంనగర్ కాలనీ చెందిన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ లో విధులు నిర్వహిస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ చెందిన పీఎస్ లత కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం చిత్తూరు లక్ష్మీ నగర్ కాలనీలో ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ని కలిశారు. టిడిపి విధానాలు, చిత్తూరులో సాగుతున్న అభివృద్ధి పనులు చూసి ఆ పార్టీలో చేరాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి టిడిపి కండువాలు కప్పి ఆ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, టిడిపి నాయకులు కాజూరు బాలాజీ, బాలాజీ నాయుడు, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

శేషాద్రి స్వామికి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి:

మండల కేంద్రంలో వెలసిన శేషాద్రి స్వామికి వారి కుటుంబీకులైనా బైరెడ్డి వారి సహకారంతో పౌర్ణమి సందర్భంగా సోమవారం విశేష పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన ప్రజలకు గుడి ధర్మకర్త బైరెడ్డి వారి కుటుంబం సహకారంతో అన్నదానం నిర్వహించారు.

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం:

చిత్ర పౌర్ణమి పురస్కరించుకొని అన్నదానం మండలంలోని మాధవ నగర్ బ్రహ్మానంద ఆశ్రమంలో కేశవానంద స్వామి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. మొదట శ్రీ సత్యనారాయ ణ స్వామి విగ్రహాలకు అభిషేక ప్రత్యేక పూజలు చేపట్టి అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సుబ్రహ్మణ్యం రెడ్డి, సుధాకర్ రెడ్డి , సుబ్రహ్మణ్యం నాయుడు, భక్తులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు పెట్టారు..
కాసరం దళితుల ఆవేదన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:

తమపై అక్రమ కేసులు పెట్టారంటూ తొట్టంబేడు మండలం, కాసరం గ్రామానికి చెందిన దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రావెల్ తోలకాలపై తమకెలాంటి సంబంధం లేకున్నా అధికారులు తమపై అక్రమ కేసులు బనాయించారంటూ వాపోయారు. వ్యవసాయ ట్రాక్టర్లు ఉన్నంత మాత్రాన గ్రావెల్ దొంగలై పోతారా అంటూ ప్రశ్నించారు. వాస్తవాలను తెలుసుకోకుండా ఒక వర్గం చెప్పినట్లు కేసులు పెట్టడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. అసలైన గ్రావెల్ దొంగలను పట్టుకుని, మాపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

రోగులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కంటి చికిత్సకు 35 మంది ఎంపిక

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: కంటి చికిత్సకు 35 మంది ఎంపికయ్యారని మిషన్ ఫర్ విజన్, చెన్నై శంకర్ నేత్రాలయ సిబ్బంది మురళి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మండల సర్వసభ సమావేశం మందిరంలో సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 60 మంది కంటి పరీక్షలు చేసుకోగా 35 మంది కంటి ఆపరేషన్‌కు ఎంపికయ్యారని వీరికి చెన్నై శంకర్ నేత్రాలయంలో ఉచితంగా ఆపరేషన్లు చేసి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అన్ని దానాల కన్నా నేత్రదానం గొప్పదని ప్రతి ఒక్కరికి కంటి చూపు ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నా మని వారు తెలిపారు. కంటి సమస్యలు ఉన్నవారు ప్రతి నెలా రెండవ సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని అవసరమైన వారు పరీక్షలు చేసుకుని కంటి సమస్యను బాగు చేసుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్ నేత్రాలయ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

- డీఈ సురేష్ కుమార్

ప్రజాశక్తి- కార్వేటినగరం :

రైతులకు అందుబాటులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో ఉన్నాయని విద్యుత్ డిప్యూటీ ఇంజనీర్ ఎస్ సురేష్ కుమార్ అన్నారు. సోమవారం కార్వేటినగరంలోని విద్యుత్ ఏడిఈ కార్యాల యాన్ని సందర్శించారు. అనంతరం డీఈ మాట్లాడుతూ గతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు రైతులకు చిత్తూరు లేదా పుత్తూరుకు వెళ్లి తీసుకొని వచ్చేవారన్నారు. ప్రస్తుతం 15 రోజులలో మండల పరిధిలోని అన్నూరు సబ్‌స్టేషన్ వద్దే రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అందిస్తు న్నారన్నా రు. రైతులకు ఎంతో ఉపయోగకరమన్నారు. లైన్‌మ్యాన్‌లు ఆయా రూట్లో విద్యుత్‌పై నిఘా ఉంచాల న్నారు. విద్యుత్ సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ రామ్మూర్తి పాల్గొన్నారు.

కార్వేటినగరం విద్యుత్ డీఈ ఎస్ సురేష్‌కుమార్

భూ గర్భ జలాల పెంపుతోనే భవిష్యత్తు

- దూర దృష్టితో పని చేయాలి- ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ :

భూ గర్భ జలాల పెంపుతోనే భవిష్యత్తు అన్నారు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు. వేసవి నేపథ్యంలో చిత్తూరు పార్లమెంటులో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. దూర దృష్టితో పని చేసినప్పుడే సమస్య నుంచి బయట పడవచ్చన్నారు ఆయన . 'అడుగంటిన భూ గర్భ జలాలు.., నీటి గ్రిడ్ పనులు ఇంకెప్పుడు అనే?' వార్తా కథనాల పై చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు సోమవారం ఢిల్లీ నుంచి స్పందించారు. మొన్న చిత్తూరు కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరంలో కలెక్టర్ సుమిత్ కుమార్ అధ్యక్షతన.., రాష్ట్ర మంత్రి పి.రాం ప్రసాద రెడ్డి నేతృత్వంలో జరిగిన జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో భూ గర్భ జలాల పెంపు.., నీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యల పై సుదీర్ఘంగా సమీక్షించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. . ఇదే అంశానికి సంబంధించి దిశానిర్దేశం చేసి.., అధికారులను అప్రమత్తం చేశామన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో రాజీ పడొద్దని జిల్లా యంత్రాంగానికి తెలియజేసినట్లు చెప్పారు. ముందు చూపుతో..చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్ చిత్తూరు పార్లమెంటులో నీటి ఎద్దడి నివారణకు చేపట్టిన చర్యలు అభినందనీయమన్నారు. భూ గర్భ జలాల పెంపు కోసం, గతంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకొచ్చిన సంస్కరణలు స్ఫూర్తి దాయకంగా నిలిచాయన్నారు. ఇప్పుడు కూడా ఏపీ సీఎం చంద్రబాబు అదే పంథాలో కొనసాగుతున్నారని చెప్పారు. ఇకపోతే... వేసవి నేపథ్యంలో చిత్తూరు పార్లమెంటులో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టి ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని ఆయన అధికారులకు సూచించారు. మరీ ముఖ్యంగా చిత్తూరు పార్లమెంటు అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న తాను.., నీటి ఎద్దడి నివారణకు కావలసిన సహాయ సహకారాలు అందించేందుకు వెనకాడబోనని ఎంపీ స్పష్టం చేశారు.

తక్కువ ధరకే స్నిక్కర్ యాప్ ద్వారా హోం సర్వీసులు: చైతన్య

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

తిరుపతిలో తక్కువ ధరకే ఇంటికి సంబంధించిన సర్వీసులను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు స్నిక్కర్ యాప్ నిర్వాహకులు చైతన్య తెలిపారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో స్నిక్కర్ యాప్‌ను లాంచ్ చేసి, ఈ యాప్ ద్వారా ఇంటికి సంబంధించిన వస్తువులను శుభ్రపరచుకోవడానికి, సర్వీసు చేయించుకోవడానికి అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. ఈ యాప్ ద్వారా ఇంటిని శుభ్రపరచడం, మరుగుదొడ్లను శు భ్రపరచడం, ఎయిర్ కండీషనర్లను సర్వీసు చేయడం, ప్లంబింగ్ పనులు, ఎలక్ట్రికల్, కార్ వాష్ వంటి సదుపాయాలను అందుబాటులో ఉంచామన్నారు. 7799466684 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇస్తే ఈ సర్వీసులు చేయడానికి తమ సిబ్బంది అందుబాటులోకి వస్తారన్నారు. నిర్ణీతం గంట సమయానికి రుసుము చెల్లించేలా నిర్ణయించామన్నారు. గూగుల్ ప్లే స్టోర్‌లో ఈ యాప్ అందుబాటులో ఉందన్నారు.

క్రైం న్యూస్

ఇంటి స్థల వివాదం
12 మందిపై కేసు

ప్రజాశక్తి -సోమల: ఇంటి స్థల వివాదంలో ఇరు గ్రూపుల ఘర్షణతో 12 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సోమల మండలం పెద్ద ఉప్పరపల్లి దిగువ వీధిలో లక్ష్మీపతి కుటుంబ సభ్యులు, శంకరయ్య కుటుంబ సభ్యులు ఇంటి స్థల వివాదంలో ఘర్షణ పడ్డారు. ఇరుగ్రూపుల తగాదాలో రక్త గాయాలు అయ్యేలా ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఇరు గ్రూపులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివ శంకర్ తెలిపారు. ఈ కేసులో మొత్తం 12 మందిపై కేసు నమోదు చేసి బైండోవర్ చేసినట్టు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీ
వ్యక్తి మృతి

ప్రజాశక్తి -గుడిపాల: ఇరు ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి గుడిపాల మండల కేంద్రంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ కథనం మేరకు.. గుడిపాల మండలంలోని వసంతాపురం గ్రామానికి చెందిన మహేష్ (33) గుడిపాల క్రాస్ రోడ్లో వెళ్తుండగా మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలతో చీలాపల్లి సీఎంసి ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం అంబులెన్స్ ద్వారా తరలించారు. పరిస్థితి విషమించడంతో మహేష్ మృతి చెందాడు పోలీసులు కేసు దర్యాప్తు చేసున్నారు.

హర్షం వ్యక్తం చేస్తున్న యాజమాన్యం

విజయం డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:

స్థానిక సుందరనాయుడు బిల్డింగ్స్ లోని విజయం సైన్స్ అండ్ డిగ్రీ కళాశాలకు యుజిసి ద్వారా స్వయం ప్రతిపత్తి హోదా లభించినట్లు విద్యాసంస్థల అధినేత డాక్టర్ తేజ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు సాధారణ ఫీజులతో నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో 2023లో స్థాపించిన విజయం డిగ్రీ కళాశాల గ్రామీణ ఉన్నత విలువలతో కూడుకున్న విద్యతో పాటు విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తూ డిగ్రీ పూర్తయిన తర్వాత ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. అకాడమిక్ ఫలితాల్లో అద్భుత విజయాలను సాధిస్తూ యూనివర్సిటీ స్థాయిలో కళాశాల ప్రథమ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు 23 సంవత్సరాలుగా విజయం డిగ్రీ కళాశాల ద్వారా వేలాది మంది గ్రామీణ విద్యార్థుల జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ప్రభుత్వ ఎంఎన్సి రంగాల్లో ఉద్యోగాలు కల్పిస్తున్న సంస్థగా రాణించిందన్నారు. ఈ ప్రమాణాలతో తమ కళాశాలకు 2022లో ప్రతిష్టాత్మకమైన ఎన్ ఏ ఏ సి ఏ గ్రేడ్ 3.35/40 సిజిపిఏ స్కోర్ తో తొలి ప్రయత్నం లోనే సాధించిందని 2024 లో యూనివర్సిటీ గ్రాండ్ కమిషన్ నుండి 2 గుర్తింపును పొందడంతో పాటు 2025- 26 విద్యా సంవత్సరంలో స్వయం ప్రతిపత్తి హోదా ద్వారా అక్కడమిక్ కరి కులంలో నూతన కోర్సులు, ఏర్పాటు చేసుకోవడానికి పూర్తి స్వేచ్ఛ ఉంటుందని. విద్యార్థులు గ్లోబల్ ల్యాండ్ స్కేప్లలో రాణించడానికి అవసరమైన పరిజ్ఞానం నైపుణ్యాలను అందిపుచ్చుకోవడానికి దోహదపడు తుందని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ శైలజ మూర్తి మాట్లాడుతూ స్వయం ప్రతిపత్తి అనేది ఒక హోదా మాత్రమే కాదు ఒక బాధ్యత కూడా అని ఈ గుర్తింపు ద్వారా ఆధునిక ఉపాధి యోగ్యమైన విద్యను విద్యార్థులకు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు ప్రస్తుతం 1 విధానానికి అనుగుణంగా తాము ప్రగతిశీల ఆచరణాత్మక పాఠ్యాంశాలను పరిచయం చేస్తున్నామన్నారు ఈ విజయం తమ ఆలోచనలను గౌరవించిన విద్యార్థులకు పూర్వ విద్యార్థులకు తల్లిదండ్రులకు శ్రేయోభిలాషులకు అంకిత భావం కలిగిన అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కండేయ నాయుడు, రమణ ప్రసాద్, దేవేంద్రన్, రాజగోపాల్ నాయుడు, శ్రీనివాసన్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలింపు

ప్రజాశక్తి-ఏర్పేడు:

ఏర్పేడు మండలంలోని పలు గ్రామాలలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోతోంది. ఎండి పుత్తూరులో సోమవారం రేషన్ బియ్యం అక్రమ వ్యాపారులు పేదల నుండి 18 బస్తాలు సుమారు 800 కేజీలు బియ్యం కొనుగోలు చేసి ఆటోలో తరలించారు.

పదవి నుంచి తప్పుకుంటున్నాం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :

నూతనంగా ఏర్పాటయిన మున్సిపల్ సంఘం కార్యవర్గం నుంచి తప్పుకుంటున్నామని ఎన్నికైన సభ్యులు కొందరు రాజీనామా పత్రాలు సోమవారం కమిటీకి సమర్పించారు. వారిలో మునిసిపల్ ఇంజనీరింగ్ సెక్షన్, శానిటరీ సెక్షన్, టౌన్ ప్లానింగ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు ఉన్నారు. ముఖ్యంగా కమిటీ కార్యవర్గ కార్యదర్శి గోపి, ప్రధాన కార్యదర్శి ఎస్.మిథున్ చక్రవర్తి, మరి కొందరు సభ్యులు పదవి నుంచి తప్పుకుంటున్నామని కమిటీ అధ్యక్షుడు రాజీనామా పత్రం సమర్పించారు.

నర్సుల సేవలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి - యాదమరి: ప్రభుత్వ ఆసుపత్రుల్లో నర్సుల సేవలు వెలకట్ట లేని వని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీ నారాయణ అన్నారు. సోమవారం యాదమరి పిహెచ్‌సిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భం గా స్టాఫ్ నర్స్ ప్రభావతిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోగిని తన వారిగా భావించి ఆస్పత్రికి వచ్చినప్పటి నుంచి తిరిగి ఇంటికి వెళ్లే వరకు నిస్వార్థ సేవలు అందిస్తున్న నర్సులకు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. యదమరి వైద్య అధికారిని డాక్టర్ సురేఖ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ స్టాఫ్ నర్స్ ప్రభావతిని సన్మానించారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం పురస్కరించుకొని సోమవారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్స్‌గా పనిచేస్తున్న ప్రభావతిని వైద్యాధికారి, సిహెచ్‌ఓలు సిబ్బందితో కలిసి దుశ్శాలు వాలు, పూలమాలతో సన్మానిం చారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ ప్రతిరోగిని ఆప్యాయంగా పలకరించి వారికి కావలసిన సేవలను ఉచితంగా అందిస్తూ తన సొంత వారిలా వారిని భావించి ఆరోగ్య వంతులు అయ్యే వరకు వివిధ రకాల సేవలు అందిస్తున్న ప్రతి ఒక నర్సుకు అంతర్జాతీయ నర్సుల దినోత్సవ శు భాకాంక్షలు తెలుపుతున్నామని మీ సేవలు విలువ కట్టలేనిదని ఈ సందర్భంగా వైద్యాధికారిని డాక్టర్ సురేఖ, సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపరువైజరు సెల్వారాణి, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నర్సులను సన్మానిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION):: PALAMANER.
H.M.O.P.NO. 110 OF 2024

Between:
Basini Subramanyam Moulika @ Chinna @ Moulika. ...Petitioner.
And:
B. Hariprasad ...Respondent.

NOTICE TO THE RESPONDENT.

TO.
B. Hariprasad, S/o. B. Jayaramaiah,
Aged about 37 years, Hindu, residing at
D.No.18-2-271, Abbanna colony, Tirupati.

Please take notice that Petitioner has filed the above petition against you for decree of divorce. The above said matter posted to 19-06-2025 for your appearance. Please be present before said court at 10-30 A.M., either in person or through an advocate and file your objections if any, failing compliance, the said matter will be decide as set - exparte in your absence.

Place Palamaner
Dt. 06-05-2025

Katta Jagadesh Kumar
ADVOCATE
 # 25-832, Rangapuram Palamaner - 517408, Chittoor (Dt)-(A.P),
Cell : 9885052625, 9966359909